


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| ఆదివారం 07 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 005 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## ఏఐ ప్రభావంతో యువత నైపుణ్యాలపై దృష్టి సారించాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, బెంగుళూరు, జూన్ 7, ప్రతినిధి: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని, ముఖ్యంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు సాధించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బెంగుళూరులో ది హిందూ దినపత్రిక నిర్వహించిన హడిల్ సదస్సులో పాల్గొన్న ఆయన, కృత్రిమ మేధస్సు ప్రభావంతో తెల్లకాలర్ ఉద్యోగాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో యువత బ్లూ కాలర్ ఉద్యోగాల వైపు దృష్టి మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు వివరించిన ఆయన, యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయం స్థాపనతో పాటు పాత పద్ధతుల్లో కొనసాగుతున్న పారిశ్రామిక శిక్షణ సంస్థలను అత్యాధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్-2047 దార్శనికత కింద రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతులు, యువత, మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలతో పాటు రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలను కూడా సమగ్రంగా వివరించారు.

## కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన






సందేశం టైమ్స్, రంగారెడ్డి జిల్లా, జూన్ 7, ప్రతినిధి: హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో 1.34 కోట్ల జనాభాతో వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూ.2,300 కోట్ల వ్యయంతో 240 ఎకరాల్లో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పండ్ల మార్కెట్‌తో పాటు సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి కూడా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ఈ మార్కెట్‌కు కూడా అంతర్జాతీయ గుర్తింపు తీసుకువస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో రంగారెడ్డి జిల్లా పండ్లు, కూరగాయల సాగుతో కళకళలాడేదని, ప్రస్తుతం రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయం దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ప్రజలు అవసరాల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందని, రైతులు కేవలం కొద్దిపాటి పంటలకే పరిమితమవడం వల్ల మార్కెట్‌పై ఒత్తిడి పెరిగి కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. స్థానిక ప్రజల సహకారంతో ప్రభుత్వం ధైర్యంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించిందని, వచ్చే రెండేళ్లలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నిధుల కొరత లేకుండా గ్రీన్ చానెల్ ద్వారా విడుదల చేస్తామని, వచ్చే డిసెంబర్‌లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలకు అవకాశం ఇవ్వకుండా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫార్చ్యూన్ 500 సంస్థలను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ఏటా వేల కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ కార్యాలయాల్లో కనీస సదుపాయాలు లేకపోవడం బాధాకరమని, అందుకే అత్యాధునిక వసతులతో సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని 39 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని, రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## ఢిల్లీ అత్యవసర వైద్య సేవల బలోపేతంపై నీతి ఆయోగ్ కీలక సమావేశం





సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 7, ప్రతినిధి: దేశ రాజధాని ఢిల్లీలో అత్యవసర మరియు ట్రామా వైద్య సేవలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతంలో అత్యవసర వైద్య సేవల ప్రస్తుత పరిస్థితి, లోపాలు, సవాళ్లపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఈ సమావేశంలో ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు అందించే దిశగా భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.ఈ సమావేశానికి కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, ఢిల్లీ ప్రభుత్వం, ఎయిమ్స్ న్యూఢిల్లీ, ఆరోగ్య సేవల డైరెక్టరేట్, మున్సిపల్ కార్పొరేషన్, న్యూ ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రతినిధులతో పాటు ప్రైవేట్ వైద్య రంగానికి చెందిన నిపుణులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత అత్యవసర వైద్య సేవల వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు.అత్యవసర వైద్య సేవల్లో సాంకేతిక వినియోగం, సమర్థవంతమైన అంబులెన్స్ వ్యవస్థ, ట్రామా కేర్ కేంద్రాల విస్తరణ, రోగులకు తక్షణ సేవల అందుబాటు వంటి అంశాలపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. భవిష్యత్తులో ఢిల్లీని దేశంలోనే ఆదర్శ అత్యవసర వైద్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.



## పాకిస్తాన్‌కు మరో దెబ్బ.. చినాబ్-బియాస్ లింక్ ప్రాజెక్టుకు కేంద్రం శ్రీకారం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 7, ప్రతినిధి: దేశ ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరో కీలక వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌పై కఠిన వైఖరి అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సింధు జలాల ఒప్పందంపై కఠిన నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో ఇప్పుడు రూ.2,300 కోట్ల వ్యయంతో "చినాబ్-బియాస్ లింక్ ప్రాజెక్టు" పనులను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశానికి కేటాయించిన జల వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వ్యూహాత్మకంగా పాకిస్తాన్‌పై ఒత్తిడి పెంచే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టు అమలుతో చినాబ్ నది జలాలను బియాస్ నదితో అనుసంధానం చేసి ఉత్తర భారత రాష్ట్రాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక లాభాలు కలగనున్నట్లు సమాచారం. మరోవైపు పాకిస్తాన్‌కు వెళ్లే నీటి ప్రవాహంపై కూడా పరోక్ష ప్రభావం ఉండే అవకాశముందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి.దేశ భద్రత, జల వనరుల వినియోగం, వ్యవసాయాభివృద్ధి అంశాలను సమన్వయం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వ్యూహాత్మకంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న దేశాలపై అన్ని రంగాల్లో ఒత్తిడి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి: తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 7, ప్రతినిధి: వేసవి సెలవులు ముగిసి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన మరియు పోషకాహారం అందించేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ సూచించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం–2013, పీఎం పోషణ పథకం నిబంధనల అమలులో భాగంగా జిల్లా కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులు, విద్యాశాఖ మరియు సంక్షేమ శాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. పాఠశాల వంటశాలలను పూర్తిగా శుభ్రపరచడం, తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరిచి వినియోగించడం, వంట పాత్రలను వేడి నీటితో శుభ్రం చేయడం, నిల్వలో ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడం, మరుగుదొడ్లు మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలు చేపట్టాలని కమిషన్ సూచించింది. ఇదిలా ఉండగా సిద్దిపేటలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో హనుమాన్ నగర్ వడ్డెర కాలనీలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉదయం అల్పాహారం, రాగిజావ, పాలు, పౌష్టిక మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలలో ఎన్‌సీసీ, కంప్యూటర్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బి. వెంకటరమణ, ఉపాధ్యాయులు శ్రీదేవి, సాగర్, జోష్నతో పాటు స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాస్కోలో వినూత్న 'స్కూల్ 21' విద్యావిధానాన్ని పరిశీలించిన ప్రతినిధి బృందం



సందేశం టైమ్స్, మాస్కో, జూన్ 7, ప్రతినిధి: రష్యా రాజధాని మాస్కోలో స్బేర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినూత్న విద్యాసంస్థ "స్కూల్ 21"ను సందర్శించిన సందర్భంగా అక్కడ అమలు చేస్తున్న ఆధునిక విద్యావిధానాలను ప్రత్యక్షంగా పరిశీలించినట్లు ప్రతినిధి బృందం తెలిపింది. సంప్రదాయ బోధనా విధానాలకు భిన్నంగా సాంకేతికత ఆధారిత శిక్షణ, స్వయంకృషి అభ్యాస పద్ధతులు, సమస్యల పరిష్కార సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఆకట్టుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, విద్యార్థులతో మాట్లాడి విద్యా విధానం, డిజిటల్ శిక్షణా పద్ధతులు, భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాల అభివృద్ధిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా విద్యా రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు అవసరమని ఈ సందర్శన ద్వారా స్పష్టమైందని అభిప్రాయపడ్డారు.

# అందోల్ మున్సిపల్ ఆధ్వర్యంలో 99 రోజుల కార్యక్రమంలో గ్రామసభ నిర్వహణ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 7, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్-జోగిపేట మున్సిపల్ ఆధ్వర్యంలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా 10, 11, 12, 16 వార్డులకు సంబంధించిన ప్రజల సమస్యల పరిష్కార దిశగా గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మున్సిపల్ కమిషనర్ తిరుపతి పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు రేఖ ప్రవీణ్, కల్పన నాగరాజు, సరస్వతి నాగరాజు, పట్లోళ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడికుంద గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహణ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 7, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గం వట్పల్లి మండలంలోని మేడికుంద గ్రామపంచాయతీలో సర్పంచ్ శ్రీమతి చంద్రకళ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి హన్మంత్ రెడ్డి గ్రామ అభివృద్ధి నివేదికను చదివి వినిపించగా, కార్యదర్శి చరణ్ రాజ్ ఎజెండా అంశాలపై చర్చ నిర్వహించి గ్రామ పెద్దల ద్వారా పరిష్కార మార్గాలను సూచింపజేశారు. గ్రామంలో నర్సరీ నిర్వహణ, మురికికాలువల పరిశుభ్రత, వీధి లైట్లు, బడిబాట కార్యక్రమం, ప్రీ ప్రైమరీ విభాగం, మంచినీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్ల ఫోటో క్యాప్చర్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ శంకరప్ప, సాయికృష్ణ హెచ్ఎం, సంగమేశ్వర్ ఎఫ్ఏ, గ్రామ పెద్దలు పాల్గొని సభను విజయవంతం చేశారు.

# రెండు కుటుంబాల మధ్య గొడవను సామరస్యంగా పరిష్కరించిన మెట్టు కుమార్ యాదవ్



సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 7, బి. డేవిడ్: పటాన్చెరువు డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీలో రెండు గృహాల మధ్య గోడ విషయంలో తలెత్తిన వివాదం గొడవకు దారితీయగా విషయం తెలుసుకున్న పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ వెంటనే స్పందించి ఇరు వర్గాల గృహ యజమానులతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. ఇరు కుటుంబాల మధ్య అపార్థాలు తొలగించి శాంతియుత వాతావరణం నెలకొల్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గొడవ పెద్దది కాకముందే పరిష్కారం చూపినందుకు ఇరు గృహాల యజమానులు మెట్టు కుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి, రాజు వర్ధన్, వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్, మాజీ వార్డ్ కమిటీ సభ్యుడు బీఎస్పీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చింతకానిలో గ్రామసభ నిర్వహణ.. అభివృద్ధి ప్రణాళికలపై చర్చ





సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 7, ప్రతినిధి: చింతకాని మండల కేంద్రంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో ముగింపు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించడంతో పాటు రాబోయే వర్షాకాలంలో వ్యాపించే వివిధ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పంట వ్యర్థాలను కాల్చవద్దని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. ఇదే సందర్భంగా నిన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పదవ వార్డు సభ్యుడు మాతంగి నాగరాజుకు సభలో కొద్దిసేపు మౌనం పాటించి సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోలా ఉమారాణి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 7, ప్రతినిధి: పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. చిన్న శంకరంపేట్ మండలంలోని రాదేశాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 115 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,05,12,480 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, లబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్థిక వృద్ధి రేటులో మెదక్ దూసుకుపోతోంది: అదనపు కలెక్టర్ నగేష్




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 7, ప్రతినిధి: గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.5607.28 కోట్ల రుణాలను వివిధ రంగాలకు పంపిణీ చేసి నిర్దేశించిన లక్ష్యంలో 85.05 శాతం సాధించామని, జిల్లా ఆర్థిక వృద్ధి రేటులో మెదక్ జిల్లా దూసుకుపోతోందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశం (డీసీసీ/డీఎల్ఆర్సీ)లో కన్వీనర్ ఎల్డీఎం బాపూజీ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరడంలో బ్యాంకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వ్యవసాయం, స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రాధాన్యతనిస్తూ రుణాలు అందించడం ద్వారా జిల్లాలో ఆర్థిక స్వావలంబన పెరుగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా బ్యాంకర్లు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి వంద శాతం రుణ లక్ష్యాలను సాధించాలని సూచించారు. రైతులు పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకునేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా అందించే రుణ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. పీఎం ఈజీపీ, పీఎం విశ్వకర్మ వంటి ఉపాధి పథకాలపై బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రుణాల మంజూరుతో పాటు వాటి రికవరీపై కూడా శ్రద్ధ వహించాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను వ్యాపారాభివృద్ధికి వినియోగించి సకాలంలో చెల్లింపులు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎల్డీఎం బాపూజీ గణాంకాలను వెల్లడిస్తూ 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.3580.08 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.462.17 కోట్లు, మహిళా సంఘాలకు రూ.539.28 కోట్లు, గృహ రుణాలకు రూ.25.7 కోట్లు, విద్యా రుణాలకు రూ.3.4 కోట్లు, ఇతర రంగాలకు రూ.1403.39 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్బీఐ ప్రతినిధి శ్రీనివాస్, నాబార్డ్ డీడీఎం కృష్ణచైతన్య, వివిధ బ్యాంకుల ఏజీఎంలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రుతుపవనాల నేపథ్యంలో వరి కొనుగోలు వేగవంతం చేయాలి: సీఎస్ రామకృష్ణారావు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 7, ప్రతినిధి: మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వరి కొనుగోలు ప్రక్రియతో పాటు జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎం సివిల్ సప్లై నిత్యానంద్ తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వడ్లను వెంటనే లారీల ద్వారా మిల్లులు, గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సీఎస్ సూచించారు. అలాగే జూన్ 9న జరిగే ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి మండల మహిళా సమాఖ్య సభ్యులను ఆయా మండలాల నుంచి బస్సుల ద్వారా సాయంత్రం 4 గంటలలోపు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు చేరేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఇదే సమయంలో నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, డీసీఓ కరుణ, ఏసీపీ భీం శర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్ కరపత్రాల ఆవిష్కరణ



సందేశం టైమ్స్, నాగులవంచ, జూన్ 7, ప్రతినిధి: మండల పరిధిలోని నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన కొత్త అడ్మిషన్ కరపత్రాలను నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తోందన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఒత్తిడి లేని ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎల్ఎం అండ్ డీటీ, ఏసీపీ అండ్ ఎం వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి కలలను సాకారం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రిన్సిపల్ పి. నవీన్ బాబును అభినందించారు. ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న బండారి గంగాధర్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 7, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి తొలి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండో రోజు కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు, పిల్లుట్ల గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, చెరువులు, కుంటలు నిండి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బీజీఆర్ యువసేన అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, గౌడ్ సంఘం అధ్యక్షుడు బుర్ర పోచ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ మహేష్ గౌడ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ బాచంపల్లి శ్రీధర్ గౌడ్, బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొందిల శ్రీనివాస్ గౌడ్, బుర్ర సత్యనారాయణ గౌడ్, బుర్ర రాఘవేంద్ర గౌడ్, కర్రే శ్రీకాంత్ గౌడ్, బుర్ర హరిశంకర్ గౌడ్, శివంపేట జాతీయ మానవ హక్కుల కమిటీ అధ్యక్షుడు సంద్ర సుదర్శన్, పిల్లి సురేష్, గౌడ్ దాసు, పెంటమ్మరాజు సంతోష్, గౌడ్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




## టిడ్కో బాధితులకు ఊరట.. రూ.6.53 కోట్ల మెగా చెక్ పంపిణీ

సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 7, ప్రతినిధి: కాకినాడ అర్బన్ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి కూడా గృహాలు పొందలేకపోయిన లబ్ధిదారులకు ఊరటనిస్తూ ప్రభుత్వం వారి సొమ్మును తిరిగి చెల్లించే ప్రక్రియను ప్రారంభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుమతితో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శనివారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో రూ.6.53 కోట్ల మెగా చెక్కును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు నగర పరిధిలోనే గృహాలు అందించాలనే లక్ష్యంతో పోర్టు అధికారుల సహకారంతో కాకినాడలో 4,554 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందులో 1,150 డబుల్ బెడ్‌రూమ్, 904 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు పేర్కొన్నారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత టిడ్కో గృహాల నిర్మాణం, పంపిణీ ప్రక్రియలో జాప్యం ఏర్పడటంతో లాటరీల్లో ఎంపికైన పలువురు లబ్ధిదారులు ఇళ్లు పొందలేకపోయారని తెలిపారు. ఇల్లు వస్తుందనే ఆశతో తమ పొదుపు సొమ్మును చెల్లించిన కుటుంబాలు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఇళ్లు రాని వారికి వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించే ప్రక్రియకు మార్గం సుగమమైందని వెల్లడించారు. కాకినాడ నగరంలో 739 మంది లబ్ధిదారులకు రూ.6.53 కోట్లను చెక్కుల రూపంలో అందజేసినట్లు తెలిపారు. టిడ్కో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మిగిలిన బాధితులకు కూడా న్యాయం జరిగేలా చర్యలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీపీఆర్వో శైలజ, మెప్మా సిఎంఎం రాజు, గదుల సాయిబాబా, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## షుగర్ ఫ్యాక్టరీలో ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 7, ప్రతినిధి: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని షుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను అదనపు కలెక్టర్ నగేష్ ఆర్డీవో, తహసీల్దార్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల నుంచి ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ట్యాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేసి డేటా నమోదు ప్రక్రియను వేగంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు.

## వాతావరణ అనుకూల పంటల సాగుతో రైతులు లాభాలు పొందాలి: సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 7, ప్రతినిధి: తెలంగాణలో రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టి పంటల మార్పిడిని అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. రైతులకు పంటలపై అవగాహన కల్పించి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పత్తి, కందులు, మిరప, వేరుశనగ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. వాతావరణ మార్పులను తట్టుకునే కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, కొర్రలు వంటి పంటల సాగు రైతులకు మేలు చేస్తుందని తెలిపారు. వీటి ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో కూడా నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. అలాగే వరి సాగు చేసే ప్రాంతాల్లో జూలై 15 వరకు తగినంత వర్షపాతం నమోదు కాకపోతే 125 రోజుల లోపు పంట కాలం పూర్తయ్యే స్వల్పకాలిక వరి రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. వర్షాల పరిస్థితిని నిరంతరం గమనిస్తూ వ్యవసాయ శాఖ అందించే సూచనలు, సలహాలను పాటించాలని కోరారు. శాస్త్రీయ విధానాలతో వ్యవసాయం చేస్తూ పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటే రైతులు అధిక లాభాలు పొందగలరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం





సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 7, ప్రతినిధి: కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా ప్రాసిక్యూషన్ డైరెక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, విచారణ దశలో ఉన్న ముఖ్యమైన కేసులు, వారెంట్ అమలు, సాక్షుల హాజరు, చార్జ్‌షీట్ల దాఖలు, అప్పీలు తదితర న్యాయపరమైన అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కేసుల విచారణ సమయంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మాట్లాడుతూ నాణ్యమైన సాక్ష్యాధారాలు సమర్పించడం ద్వారా నేరస్థులకు శిక్షలు పడే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులు కేసు డైరీలు, ఫోరెన్సిక్ నివేదికలు, వైద్య ధృవపత్రాలు తదితర పత్రాలను సకాలంలో అందించాలని సూచించారు. కోర్టు కానిస్టేబుళ్లు సాక్షులకు సమన్లు అందించడం, వారిని కోర్టుకు హాజరు పరచడం, వారెంట్ల అమలులో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన కేసులు, పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమావేశంలో సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు పేర్కొన్నారు. ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తూ, కోర్టు విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న సిబ్బందిని అభినందించారు. సమావేశంలో జిల్లా ప్రాసిక్యూషన్ డైరెక్టర్ శ్రీమతి పి.వి. జయలక్ష్మి, ఎస్బీ డీఎస్పీ కెవివి సత్యనారాయణ, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ దుర్గా శేఖర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లా పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 7, ప్రతినిధి: జిల్లాలో రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటూ ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లావ్యాప్తంగా 80,391 మంది రైతుల నుంచి 3,67,685.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే 62,363 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.664.67 కోట్ల చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలో కొనుగోలు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో 256 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు తెలిపారు. రైతులకు రావలసిన చెల్లింపులు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మైలారం మల్లన్నకు మొక్కులు చెల్లించిన రాజు యాదవ్, స్నేహితులు



సందేశం టైమ్స్, జహీరాబాద్, జూన్ 7, ప్రతినిధి: జీర్లపల్లి గ్రామానికి చెందిన కురుమ రాజు యాదవ్ ఆధ్వర్యంలో భక్తులు మైలారం శ్రీ మల్లికార్జున స్వామి (మల్లన్న) ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం పూర్ణకుంభ స్వాగతంతో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని మల్లన్న స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రత్యేక దర్శనం కల్పించి ఆదరాభిమానాలు చూపిన ఆలయ కమిటీ సభ్యులకు భక్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు యాదవ్, రిపోర్టర్ మల్లేష్ యాదవ్, అమర్నాథ్ స్వామి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నాలుగు రోజుల్లోనే స్నాచింగ్ కేసు ఛేదన.. ఇద్దరు నిందితుల అరెస్ట్

సందేశం టైమ్స్, హద్నూర్, జూన్ 7, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముంగి, బసంతపూర్ గ్రామాల్లో మహిళల మెడల్లోని బంగారు ఆభరణాలను లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను పోలీసులు కేవలం నాలుగు రోజుల్లోనే అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం గంగ్వార్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా మహిళల వద్ద నుంచి బంగారం స్నాచింగ్ చేసినట్లు అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి సుమారు ఒకటిన్నర తులాల బంగారం, రూ.15 వేల నగదు, నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించి నిందితులను పట్టుకున్న హద్నూర్ ఎస్ఐతో పాటు క్రైమ్ స్టాఫ్ సిబ్బంది ఆనంద్, ఓందేవ్, రవి, మహేష్‌లను జహీరాబాద్ డీఎస్పీ సైదా అభినందించారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



## గాంధీ ఆసుపత్రిలో వట్టే జానయ్య యాదవ్‌ను పరామర్శించిన రమేష్ యాదవ్

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 7, ప్రతినిధి: హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీసీ ఉద్యమ నాయకుడు వట్టే జానయ్య యాదవ్‌ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన జానయ్య యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రమేష్ యాదవ్ మాట్లాడుతూ వట్టే జానయ్య యాదవ్‌కు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఆయన ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జానయ్య యాదవ్‌కు ఏదైనా అపాయం జరిగితే దానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న జానయ్య యాదవ్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## సంగారెడ్డిలో మరో 210 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి





సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 7, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు విడతల వారీగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటికే 400 మంది చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి శనివారం మరో 210 మంది చిన్నారులకు సైకిళ్లు అందజేశారు. చిన్నారుల్లో ఉత్సాహం, ఆరోగ్యం, చదువుపట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతి చిన్నారికి జగ్గారెడ్డి స్వయంగా సైకిల్ అందజేశారు. ఐదు సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు ప్రత్యేకంగా సైకిళ్లు పంపిణీ చేశారు. గత వారం టోకెన్లు పొందిన వారికి శనివారం సైకిళ్లు అందజేయగా, టోకెన్లు లేని చిన్నారుల వివరాలు సేకరించి మరో విడతలో సైకిళ్లు పంపిణీ చేస్తామని నిర్వాహకులకు సూచించారు. సైకిళ్లు రాని చిన్నారులు ఎవరూ ఆందోళన చెందవద్దని, పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ తప్పకుండా సైకిళ్లు అందజేస్తామని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, మహేష్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.



## జోగిపేట క్లాక్‌టవర్ వద్ద రష్మిక మందన్న సినిమా షూటింగ్ సందడి

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 7, 2026: జోగిపేట పట్టణంలోని ప్రముఖ గుర్తింపుగా నిలిచిన క్లాక్‌టవర్ ప్రాంతం ప్రముఖ సినీ నటి రష్మిక మందన్న పాల్గొన్న సినిమా షూటింగ్‌తో సందడిగా మారింది. క్లాక్‌టవర్ పరిసర ప్రాంతాల్లో చిత్రబృందం కీలక సన్నివేశాలను చిత్రీకరించగా, రష్మిక మందన్నను చూసేందుకు అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భద్రతా ఏర్పాట్ల మధ్య షూటింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాల్లో బిజీగా ఉన్న రష్మిక మందన్న జోగిపేటలో షూటింగ్‌లో పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశమైంది. షూటింగ్ కారణంగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా పోలీసులు, నిర్వాహకులు పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించారు.




## తెలంగాణ జూనియర్ రగ్బీ-7ఎస్ టోర్నమెంట్ ముగింపు వేడుకలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 7, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని సదాశివపేటలో ఉన్న వోక్సెన్ విశ్వవిద్యాలయంలో సంగారెడ్డి రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ జూనియర్ బాలురు, బాలికల రగ్బీ-7ఎస్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్రం, దేశానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. రగ్బీ వంటి జట్టు క్రీడలు పరస్పర సహకారం, సమన్వయం, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని అన్నారు. యువ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించేందుకు సమాజంలోని ప్రతి వర్గం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేసి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని చాటుతూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని ప్రశంసించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి తెలంగాణకు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడారంగ అభివృద్ధి యువత సాధికారతకు కీలకమని పేర్కొంటూ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించడంలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు శశికుమార్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, సూర్య, వోక్సెన్ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ హెడ్ విశాల్, కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎంఫీఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: అవగాహన సదస్సులో వక్తలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండల ప్రతినిధి, జూన్ 7, 2026: ఆందోల్ మండల కేంద్రంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, చెట్ల నరికివేత వల్ల ఎదురవుతున్న సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను పరిరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు, యువత తమ సందేహాలను వ్యక్తం చేయగా నిపుణులు వాటికి సమాధానాలు ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువత, వివిధ శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశం అనంతరం పర్యావరణ పరిరక్షణకు అందరూ కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.